క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించొద్దు



మురుగు తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నారాయణఖేడ్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా పారిశుద్ధ్య పనుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్ అన్నారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటికి వరద నీరు తోడై మురుగు కాల్వల్లో ప్లాస్టిక్, చెత్తా చెదారం పేరుకుపోయే అవకాశం ఉన్నందునా ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని సూచించారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెం శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని ముదిరాజ్ సంఘం ఇన్‌చార్జి డీబీ నాగభూషణం అన్నారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు భాస్కర్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను బీసీ(డీ) నుంచి (ఏ)లోకి మార్చాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం 75శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలు అమలు చేసి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ మత్స్య కో–ఆపరేటివ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు జరిపించాలన్నారు. ముదిరాజులకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మంత్రివర్గంలో ముదిరాజులకు ప్రత్యేక స్థానం కల్పించడంతో పాటు 10 శాతం కార్పొరేషన్లలో ముదిరాజులకు స్థానం కల్పించాలని కోరారు. ముదిరాజ్ సంఘం నాయకులు చాపల వెంకటేశం, అరిగే వెంకటేశం, సాయిబాబా, ప్రకాష్, దానయ్య, చంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

పటాన్‌చెరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా అప్రమత్తంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ స్టాఫ్, హెల్త్ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యుత్ పానెల్ బోర్డులను వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ ప్లేస్కూల్ ప్రతిపాదన సరైంది కాదు

నారాయణఖేడ్: అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని, ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరి డిమాండ్ చేశారు. మండలం పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించడం లేదన్నారు. 3వ తరగతి వరకు అంగన్‌వాడీలకు అప్పగించడం ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించదగిందని వివరించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసి మిగిలిన ఖాళీ పోస్టులకు పదోన్నతులు చేపట్టాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శి నరేష్, ఖేడ్ బాధ్యులు హరిసింగ్, రాజు, ఏసుదాస్, విఠల్, బస్వరాజ్, సంజీవ్‌కుమార్, జావిద్, అలీ, శ్రీనివాస్‌రావు, తుకారాం, నాగ్‌నాథ్, అంజయ్య పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న జ్ఞాన మంజరి

పనులు పూర్తయ్యేదెన్నడో?

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేసేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో లక్ష్యం నెరవేరడం లేదు. విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించడం కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నాయి. అయినా.. నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు.

– కంది(సంగారెడ్డి)



మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ కళాశాల భవనం

- నత్తనడకన మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ సముదాయాల నిర్మాణాలు
- ఐదేళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- అద్దె భవనాల్లోనే విధుల నిర్వహణ
- నిధుల మంజూరులో జాప్యం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

మైనార్టీ విద్యార్థుల కోసం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు కళాశాల, వసతి గృహం, కామన్ సర్వీస్ సెంటర్, ఉపాధ్యాయుల నివాస గృహాల సముదాయాలను నిర్మించేందుకు 2018–19లో గత ప్రభుత్వం నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ రూ.20 కోట్ల నిధులను సైతం మంజూరు చేసింది. దీంతో భవన సముదాయాలు నిర్మించేందుకు పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ.. ఐదేళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకనే సాగుతున్నాయి.

2022లోనే పనుల పూర్తికి టార్గెట్

మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాల భవనాలతో పాటు ఉపాధ్యాయుల గృహ సముదాయం పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణం పనులను 2022లోనే పూర్తిచేసి భవనాలను అందుబాటులోకి తేవాల్సి ఉండగా కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.6 కోట్ల నిధులు ఆగిపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కామన్ సర్వీస్ సెంటర్ నిర్మాణం కోసం అదనంగా నిధులు పెంచగా భవనం పనులు పూర్తయ్యాయి.

అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి

అసంపూర్తిగా ఉన్న పాఠశాల, కళాశాల తదితర భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని, స్థానికంగా మైనార్టీ పాఠశాల, కళాశాలలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన సముదాయ నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిధులు లేక జాప్యం

పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో ఆలస్యం అవుతోంది. దీంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. మైనార్టీ కళాశాల, పాఠశాల ఇతర సముదాయాలతో పాటు జిల్లాలోని మిగతా చోట్ల అసంపూర్తిగా ఉన్న పనులు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాంకుమార్, టీడబ్ల్యూఐడీసీ డీఈ

ఉపాధ్యాయులకు సన్మానం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన అశోక్, సుజాత బదిలీ అయ్యారు. వీరికి శనివారం పాఠశాల ఉపాధ్యాయులు గ్రామపెద్దలు కలిసి వీడ్కోలు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ మండల విద్యాధికారి అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా సేవలందించిన టీచర్ల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి**

సంగారెడ్డి టౌన్: సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూరు నుంచి ఏటిగడ్డ సంగం మీదుగా మాలపాడ్ గ్రామం వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **వర్షంనీరు మళ్లింపు**

నారాయణఖేడ్: పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి మంగల్‌పేట్ హనుమాన్ ఆలయం వరకు ఉన్న బైపాస్ రహదారిపై నుంచి వర్షం నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ జేసీబీతో రోడ్డు పక్కన కాల్వ తవ్వించి నీటి మళ్లింపు పనులను చేపట్టారు. ఆయన వెంట శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

◆ **అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని వినతి**

సంగారెడ్డి టౌన్: హత్నూర మండల పరిధిలోని సికిందల్లాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం మంజూరుతో పాటు అంగన్వాడీ టీచర్ పోస్టును భర్తీ చేయాలని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో స్థానిక నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాణిక్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, నాయకులు వీరేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రతీ సోమవారం ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ**

జోగిపేట(అందోల్): ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై మండల కేంద్రాల్లో కూడా నిర్వహించనున్నట్లు తహసీల్దారు భాస్కర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, సాధారణ సెలవు దినాలు మినహా ప్రతి సోమవారం అందోల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **విద్యాసామగ్రి అందజేత**

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని చిన్నకంజర్ల, ఐనోల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు ఎడ్యుకేషన్ కిట్స్, ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **రక్తదాతకు ప్రశంసా పత్రం**

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామానికి చెందిన టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌రెడ్డి ఉత్తమ రక్తదాతగా ఎంపికై ప్రశంసా పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లోని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నిర్వాహకులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన 2024 ఉత్తమ రక్తదాతల పురస్కారాల అందజేత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేతుల మీదుగా మైపాల్‌రెడ్డి మెమోంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు.

◆ **పోలీసులకు ఫిర్యాదు చేస్తాం**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాత్రూమ్ తాళాలు పగలగొట్టి, ధ్వంసం చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ప్రభుత్వ పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

◆ **చిన్నారులకు అక్షరాభ్యాసం**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి చిన్నారులతో టీచర్ నర్సమ్మ అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **తండాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు**

జహీరాబాద్ టౌన్: మాజీ ఎంపీ బీబీపాటిల్ సొంత నిధులతో నియోజకవర్గంలోని మిర్జంపల్లి తండా, గొడిగార్‌పల్లి తండాల్లో శనివారం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **శ్రద్ధగా చదువుకోవాలి**

సంగారెడ్డి: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుభాష్‌రెడ్డి అన్నారు. జడ్పీహెచ్ఎస్ అమ్మ పాఠశాల కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం పీఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పర్కల రాంరెడ్డి సతీమణి మంజుల జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు షూ, ,సాక్సులు పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాల పారిశుద్ధ్య కార్మికురాలు మల్లేశ్వరికి రూ.10 వేలు నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమేష్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాగౌడ్, మొగులయ్య, కైసర్, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో తమ ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన సాంస్కృతిక సారధి కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నాగభూషణం కోరారు. సంగారెడ్డిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాంస్కృతిగా సారధి కళాకారులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కళాకారులను ఆదుకోవాలన్నారు. కళాకారులకు నాలుగు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెల వేతనాలు రెగ్యులర్ అందజేస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

◆ **మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి**

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తారని కలెక్టర్ క్రాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు తహశీల్దార్లు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **కేటీఆర్‌ను కలిసిన నాయకులు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ మంత్రి కేటీఆర్‌ను పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సర్కిల్ అధ్యక్షుడు వలేషెట్టి క్రాంతి శనివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: క్వారీలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్డారం క్వారీలో రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌తో సహా నర్సింహులు పడి గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా శనివారం ఉదయం నీటిపై నర్సింహులు మృతదేహం తేలింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు తీర్పును అమలు చేయండి



కమిషనర్‌కు కోర్టు ప్రతులను అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ శైలజ అనర్హురాలిగా ప్రకటిస్తూ జిల్లా జడ్జి ఇచ్చిన జడ్జిమెంట్ కాపీని మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ మంగతాయారుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహరాజు ఎన్నికను లాంచనంగా ప్రకటించి తక్షణమే అమలు చేయాలని కమిషనర్‌ను కోరారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ, రాష్ట్ర కార్మిక నాయకులు లక్ష్మారెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహరాజు, నాయకులు మహేందర్‌రెడ్డి, వెంకటయ్య, యువజన నాయకుడు ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల మంజూరుకు కృషి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలను మంజూరు చేయడంతో పాటు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవేటర్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం మరుగున పడేయగా ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇన్నోవేషన్‌లను గుర్తించడమే కాకుండా ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించే విధంగా చేయూతనిస్తూ రుణాలు అందించాలని అధికారులకు సూచించారు. వివిధ పరిశోధనలు చేసిన నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్‌సెల్ జిల్లా ఇన్‌చార్జి సాయిశ్రీజ, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు రమేష్ చౌహాన్, దీపక్‌రెడ్డి, పండరిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఝరాసంగం: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



నారాయణఖేడ్: మాద్వార్ గ్రామంలో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం రుణ మాఫీ మొదటి విడతను ప్రారంభించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల పరిధిలోని మాచ్నూర్, కృష్ణాపూర్ గ్రామాల్లో శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ముల్తానీ, బస్వరాజ్ పాటిల్, అశోక్, సుధాకర్, రాంరెడ్డి, సంగప్ప, భాగప్ప తదితరులు పాల్గొన్నారు.

మాద్వార్ గ్రామంలో సంబురాలు

నారాయణఖేడ్: ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాన్ని మాఫీ చేయడం పట్ల మండల పరిధిలోని మాద్వార్‌లో రైతులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్‌షెట్కార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

బీఆర్ఎస్ కార్యాలయానికి టు లెట్ బోర్డు

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ మండల కార్యాలయానికి ఆ పార్టీ నాయకులు టు లెట్ బోర్డును తగిలించారు. దీంతో మండల నాయకులు బోర్డును చూసి నివ్వెరపోయారు. అధికారంలో ఉన్న పదేళ్లుగా పార్టీ కార్యాలయాన్ని నిర్వహించి, అధికారం కోల్పోయాక కార్యాలయాన్ని తొలగించడం సరైందికాదని ఆయా గ్రామాల నాయకులు వాపోతున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా కార్యాలయాన్ని ఇక్కడి నుంచి మరోచోటకు మార్చడంతో ఇంటి యజమాని టు లెట్ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. పార్టీ కార్యాలయం ఎప్పటిలాగే మరో భవనంలో కొనసాగుతుందని, కార్యకర్తలు దిగాలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



పార్టీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన టు లెట్ బోర్డు

చెరువు తూముకు బుంగ

- వృథాగా వెళ్తున్న నీరు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామ పెద్దచెరువు తూము వద్ద బుంగ పడి నీరంతా వృథాగా వెళుతోంది. గతేడాది కురిసిన వర్షాలతో పాటు తాలెల్మ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వదలడం ద్వారా చెరువు పూర్తిగా నిండటంతో చెరువు తూము వద్ద బుంగపడింది. దీంతో మూడు రోజులుగా చెరువు నీరు బయటకు వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తూముకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



చెరువు నుంచి వృథాగా వెళ్తున్న నీరు

లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలి

సదాశివపేట(సంగారెడ్డి): 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు ప్రభుత్వం పొజిషన్ చూపించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నాయకులు శంకరప్ప, ముస్తాపా, యాకూబ్‌అలి, దుర్గయ్య, రైమాబేగం, జ్యోతి, వెంకట్ పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షాలు.. చిగురిస్తున్న ఆశలు

జహీరాబాద్ వ్యవసాయశాఖ పరిధిలో వర్షాకాలం పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వర్షకాలం ప్రారంభం నుంచే అడపాదడపా వానలు కురుస్తున్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండా విత్తనాలు మొలకెత్తడంతో పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. వారం రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వానలు పంటలకు అనుకూలంగా ఉండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

– జహీరాబాద్ టౌన్



కళకళలాడుతున్న పత్తి పంట

- ఖరీఫ్ పంటలకు జీవం
- వ్యవసాయ పనుల్లో నిమగ్నం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జహీరాబాద్ వ్యవసాయశాఖ డివిజన్‌లో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలు ఉన్నాయి. ప్రాజెక్టులు, చెరువులు లేనందునా ఆయా మండలాల్లో రైతులు ప్రధానంగా వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, సోయబిన్ పంటలను అధిక విస్తీర్ణంలో పండిస్తుంటారు.

అత్యధిక విస్తీర్ణంలో పంటల సాగు

వ్యవసాయ డివిజన్‌లో ఈ ఏడాది సుమారు 1.86 లక్షల ఎకరాల్లో వానాకాలం పంటలను సాగు చేశారు. సుమారు 75వేల ఎకరాల్లో పత్తి, 45 వేల ఎకరాల్లో సోయాబిన్, 6,617 ఎకరాల్లో మినుము, 11,203 ఎకరాల్లో పెసర, 52,000 ఎకరాల్లో కంది పంటలను సాగుచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు పంటలకు జీవం పోస్తున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాలను సందర్శించి పంటలను పరిశీలిస్తున్నారు. వాతావరణ అనుకూలించడంతో పంటలు పచ్చగా కలకలలాడుతున్నాయి. అయితే ఈ సంవత్సరం ప్రభుత్వం రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో వేయనందునా పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. దీంతో వెంటనే రైతుబంధు డబ్బులను విడుదల చేయాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా పంటలు



ఖరీఫ్ పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. ఈ సంవత్సరం పంటలకు అనుకూలంగా వానలు కురుస్తున్నాయి. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి. అధికారుల సూచనలు మేరకు ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్